క్లుప్తంగా

పంచ లోహ విగ్రహాల వితరణ



శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణ స్వామి వారి పంచ లోహ విగ్రహాలు

రాంబిల్లి : దిమిలిలో శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి వారి పంచలోహ విగ్రహాలను ఇదే గ్రామానికి చెందిన శినిశెట్టి గొల్లబాబు, సరోజ దంపతులు సమర్పించారు. రూ.50వేలుతో ఈ విగ్రహాలను చేయించి ఆలయానికి ఇచ్చినట్టు అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, నేతేటి గోపాలకృష్ణ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పాయకరావుపేట : మంగవరం గ్రామంలోను, పట్టణంలో గల పాతపేట ప్రాంతంలోను దాడులు నిర్వహించి, అక్రమంగా మద్యం, సారాను కలిగివున్న వ్యక్తులను అదుపులోనికి తీసుకుని, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. మంగవరం గ్రామంలో 50 బాటిళ్ళు, పాతపేట ప్రాంతంలో 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

రక్త నమూనాల సేకరణ



రాంబిల్లిలో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రాంబిల్లి: ఫైలేరియా(బోధకాలు) నిర్ధారణ కోసం రాత్రి పూట రక్త నమూనాలు సేకరిస్తున్నామని రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఫైలేరియా నిర్ధారణ కోసం రాత్రి వేళ సేకరించిన రక్తంను పరీక్ష చేయల్సి వుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ పీహెచ్‌సీ సిబ్బంది రాత్రి వేళల్లో ఇళ్లకు వెళ్లి రక్త నమూనాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియను హెల్త్ సూపర్‌వైజర్ మూర్తి పర్యవేక్షించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు..

రాంబిల్లి : మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు తెలిపారు. ఎంపీపీ జి.శిరీష అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు. అలాగే శాఖలవారీ అధికారులు నివేదికలతో హాజరుకావాలన్నారు.

పీసీసీ అధ్యక్షుడి పరామర్శ



జగతా శ్రీనివాస్‌ను పరిమర్శించిన పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

పాయకరావుపేట : అనారోగ్య రీత్యా ఆస్పత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న పీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్‌ను పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పరామర్శించారు. పాయకరావుపేటలో నివాసం వుంటున్న జగతా శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గంప గోవిందు, నాయకులు వెంకటేష్, కృష్ణ, అన్నాజీరావు, నారాయణ చక్రవర్తి, పోలవరపు అప్పలరాజు, ప్రగడ చక్రరావు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని ర్యాలీ

అనకాపల్లి : భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాది సాయిలక్ష్మణ్ డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదించడంతో పాటు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో తాము కోర్టులను బహిష్కరించామన్నారు.

సురక్ష శిబిరాలతో ఆరోగ్య భరోసా

పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు



ఆరోగ్య సురక్ష బ్యాగులు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రయ్యదొర



పాటిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. పోతిరెడ్డిపాలెం సచివాలయ పరిధి రుక్మిణీపురం గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొరతో కలసి సందర్శించారు. శిబిరంలో ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే దృఢ సంకల్పంతో మరలా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా మిగిలిపోయిన చాలా మందికి మరో అవకాశాన్ని జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్లు, అర్బన్ క్లినిక్‌లు పీహెచ్‌సీలు నిర్మించి వాటి ద్వారా ప్రజలకు అతి చేరువగా వైద్య సేవలందించేలా ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా మందులు అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో యలమంచిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మర్రిరాజు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కంటి అద్దాలు అందిస్తున్న సర్పంచ్ సకిలేటి రాము



జానకయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. పాటిపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె స్థానిక సర్పంచ్ ఆడారి కృష్ణవేణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారన్నారు. 140 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పార్టీ నేతలు త్రిమూర్తులు, భీశెట్టి ధనశ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా పలు విభాగాలకు సంబంధించిన వైద్యులు శిబిరానికి వచ్చిన రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.



శిబిరంలో బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



సత్యవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

305 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పాయకరావుపేట : సత్యవరం గ్రామంలో 305 మందికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా వైద్య శిబిరానికి హాజరైన రోగులకు బీపీ, షుగర్, రక్తపరీక్షలు, స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జి.స్వరాజ్యం సాధారణ వైద్య పరీక్షలు, డాక్టర్ కిషోర్ కుమార్ కీళ్ల వ్యాధుల పరీక్షలు, డాక్టర్ ఎ.జయలక్ష్మి, స్త్రీల సమస్యలపై పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

జానకయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

నక్కపల్లి : జానకయ్యపేటలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 220 మందికి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, మలేరియా, యూరిన్ వంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరం తలనొప్పి, కీళ్ల నొప్పులతో బాధపడే వారు, కంటికి సంబంధించిన సమస్యలతో బాధపడేవారు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. 12 మందిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఈ శిబిరాన్ని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావులు సందర్శించారు.

ప్రజా సంక్షేమం కోసమే ప్రజా సంకల్ప యాత్ర



సమన్వయకర్త కంబాల జోగులుకు స్వీట్లు తినిపిస్తున్న చిక్కాల రామారావు



అద్దురోడ్డులో కేక్ కట్ చేస్తున్న కంబాల జోగులు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు చేసిన ప్రజా సంకల్ప యాత్ర ప్రజా సంక్షేమం కోసమే అని, పాదయాత్రలో స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావుతో కలిసి మండలంలో గల వెంకటనగరం, పాల్మన్‌పేట గ్రామంలో పార్టీ నాయకులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త కంబాల జోగులు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలనే ఎన్నికల హామీలుగా ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నింటినీ అమలు చేశారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా అందరూ కలిసి పార్టీని విజయపథంలో నడిపించి, మరలా జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. అందరికీ ఎల్లప్పుడు అందుబాటులో వుండి, పార్టీ అభివృద్ధికి, గెలుపునకు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రజాసంకల్పయాత్ర పూర్తయి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కంబాల జోగులుకు చిక్కాల రామారావు స్వీట్లు తినిపించి, అందరికీ పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ ఇన్‌చార్జి కంబాల సందీప్ పాల్గొన్నారు.

అద్దురోడ్డులో వేడుకలు

ఎస్.రాయవరం : ప్రజల హృదయాలు గెలుచుకున్న జగనన్న పాదయాత్ర ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన బాధ్యత ఉందని పాయకరావుపేట ఇన్‌చార్జ్ ,రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. జగనన్న పాదయాత్ర ముగించి అయిదేళ్లు అయిన సందర్భంగా అద్దురోడ్డులో పార్టీ నాయకులు,కార్యకర్తలు సమక్షంలో కంబాల జోగులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రజాహృదయాలు తెలుసుకునేందుకు నాడు జగనన్న చేసిన పాదయాత్ర 3648 కిలోమీటర్లు ఉప్పెనలా సాగిందన్నారు. అధికారంలోనికి వచ్చాక వారి అభ్యున్నతికి నవరత్నాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి ,వైఎస్సార్‌సీపి జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భూపతి అప్పారావు,పాలపర్తి పాపారావు,మైలపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పారావు, వెదుళ్ల బంగారి, పుట్టా సుధాకర్, మధువర్మ, గుర్రం నానాజీ, చొప్పారాజు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కోటవురట్ల : వైఎస్సార్ పశు బీమా పథకంతో పాడి రైతులకు కొండంత భరోసా అందుతోందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రప్పుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పశు బీమాను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం ద్వారా పశువులు, జీవాలు, పందులు ప్రమాదవశాత్తూ మృతి చెందితే ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. పశువులకు మూడేళ్లకు, జీవాలు, పందులకు ఏడాది నుంచి మూడేళ్ల పాటు బీమా సదుపాయం ఉందని తెలిపారు.

బీమా ఇలా.. : రెండు నుంచి 10 ఏళ్ల వయస్సు కలిగి ఒక్కసారైనా ఈనిన అవులకు, 3 నుంచి 13 ఏళ్ల వయస్సు కలిగి ఒక్కసారైనా ఈనిన గేదెలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఒక కుటుంబం గరిష్టంగా 5 పశువుల వరకు బీమా సదుపాయం కల్పించుకోవచ్చని తెలిపారు. 6 నెలల పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు పథకం వర్తించనుండగా ఒక కుటుంబం గరిష్ఠంగా 50 జీవాల వరకు బీమా చేసుకోవచ్చని తెలిపారు. దేశవాళీ, సంకరజాతి పశువులకు రూ.30 వేలు, నాటు జాతికి చెందిన పశువులకు రూ.15 వేలు, గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేలు వరకు బీమా సౌకర్యం ఉన్నట్టు తెలిపారు.

చూచుకొండలో ఉచిత పశు వైద్య శిబిరం



చూచుకొండలో పశువులను తనిఖీ చేస్తున్న డాక్టర్ భాను

మునగపాక : పశువుల పెంపకంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని చూచుకొండ పశువైద్యాధికారి భాను కోరారు. మండలంలోని చూచుకొండలో మంగళవారం పశుసంవర్ధక శాఖ అలాగే రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.మేలుజాతి పశువులను కొనుగోలు చేయాలన్నారు. పశువుల కొనుగోలుకు సంబంధించి 30 శాతం రాయితీతో రుణాలు అందజేస్తామన్నారు. 10 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, 30 పశువులకు పరీక్షలు నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి రామచంద్రరావు, గోపాలమిత్ర సిబ్బంది రఘురాం, పశు వైద్యులు సుమతి, ఉమా మహేశ్వరి, జగదీష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక : ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణలో భాగంగా సంతకాల సేకరణ జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం తోటాడలో అంబేద్కర్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో 125 అడుగుల మేర అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నెల 19న ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ,వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డి కోటేశ్వరరావు, బుద్ద రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో ఉత్సాహంగా 'జోష్' వార్షికోత్సవాలు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో 47వ వార్షికోత్సవాలు (జోష్) ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ బీఎస్‌సిపిఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ క్రిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ , రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డా.కూరపాటి కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, సికోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్ మైనింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నారెళ్ళ వెంకట సుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ వై.వి.ఎస్ చలపతిరావు హాజరయ్యారు. అతిథులంతా విద్యార్థులు ఏర్పాటు చేసిన ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించారు. శాంతి కపోతాలను ఎగురవేసి జాతీయ జెండా, శ్రీ ప్రకాష్ జెండాలకు వందన సమర్పణ చేశారు. జోష్ టార్చ్‌ని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 300 మంది ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బొలినేని కృష్ణయ్య మాట్లాడుతూ తల్లి, తండ్రి, గురువే దైవం అని, వీరిని ఉన్నతమైన దృష్టితో చూడాలని, చదువు, ఆరోగ్యం సరిగా ఉన్నప్పుడు ఎప్పటికైనా ఉన్నత స్థితికి చేరుకుంటామని పేర్కొన్నారు. గౌరవ అతిథి డా.కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ క్రమశిక్షణ జీవితంలో చాలా అవసరం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీవితంలో ఉత్తమమైన మార్గాన్ని ఎన్నుకునే జ్ఞానం చదువు ద్వారానే వస్తుందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. అతిథులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ పెసిడెంట్ డా.కంటిపూడి నరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సిలంబం (కర్రసాము) ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు

విశాఖ డెయిరీ రైతులకు అండగా ఉంది..

కోటవురట్ల : విశాఖ డెయిరీ పాడి రైతులకు అండగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో విశాఖ డెయిరీ పాడి రైతులకు మంగళవారం సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. రమేష్ మాట్లాడుతూ పాడి ద్వారా రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు పాడిని ఓ ఆసరాగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 80 మంది పాడి రైతులకు రూ.3.25 లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, పీఎస్ జి.ఎస్.ఎన్.నాయుడు, హెల్పర్ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల నాని, రైతులు పాల్గొన్నారు.



పాడి రైతులకు సంక్రాంతి బోనస్‌ను అందిస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

అగ్నిప్రమాద బాధితులకు సాయం

పాయకరావుపేట : గజపతినగరం గ్రామంలో ఇటీవలవ ఇల్లు కాలిపోయిన బాధితులకు వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నెల రోజులకు సరిపడే విధంగా బియ్యం, కూరగాయలు నిత్యావసర సరుకులు అందించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే విధంగా ప్రయత్నం చేస్తామని బాధితులైన కాకాడ కొండయ్యకు, కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌వో కాకాడ కృష్ణ, గ్రామ వలంటీర్ ఏడిద కృష్ణ, ఏడిద నాగరాజు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దగ్గుపల్లి సాయిబాబా

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

పాయకరావుపేట : మండలంలో శ్రీరాంపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. శ్రీ సరస్వతీ విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్షుడు గొర్రెల శివరామకృష్ణ సమకూర్చిన పౌష్టికాహారాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నవీన చేతుల మీదుగా అందించారు.



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న సమితి అధ్యక్షుడు శివరామకృష్ణ

విద్యా సంస్థలు సంక్రాంతి సెలవులు పాటించాల్సిందే

తుమ్మపాల : ఈ నెల 9 నుండి 18వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవులను అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పక పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పెద్ద పండగను కుటుంబ సభ్యులంతా ఒకే వేదికగా చేసుకుంటారని, సుదూర ప్రాంతాలు ప్రయాణిస్తారని తెలిపారు. అటువంటి సంప్రదాయ పండగ సెలవులను కాదని పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను యాజమాన్యాలు ప్రత్యేక తరగతుల నిర్వహణ పేరిట మానసికంగా వేధిస్తే బాలల హక్కుల కమిషన్ చూస్తూ ఊరుకోబోదని తెలిపారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులు, ఇంటర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ సెలవులు అమలు చేయడంలో ఎవరికి ఎటువంటి మినహాయింపులు ఉండబోవని పేర్కొన్నారు . ప్రభుత్వ ఆదేశాలు, కమిషన్ సూచనలు పాటించని స్కూళ్ల, కాలేజీల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలకు సిఫారసు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ విషయమై ఏపీఎస్‌సీపీసీఎస్2018జీమెయిల్.కామ్‌కు ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు చేపడతామని తెలిపారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- చిన్నతనం నుంచి క్రీడల్లో తర్ఫీదు పొందాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడలకు ఆట వస్తువుల పంపిణీ

యలమంచిలి : యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు నిరంతరం సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చునని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా మంగళవారం పట్టణ మున్సిపల్ కార్యాలయం భవనంలో వివిధ క్రీడా విభాగాల్లో మండల స్థాయికి చేరుకున్న క్రీడాకారులకు ఆట పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, మంచి విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులకు ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. వార్డు, సచివాలయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు మండల స్థాయిలోనూ మంచి ప్రతిభ కనబరిచి యలమంచిలి పట్టణానికి పేరుతేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు కౌన్సిలర్లు, ఒగిబోయిన చిరంజీవి, షేక్ సయ్యిద్ బీబీ,రాపేటి సంతోష్,కొఠారు కొండబాబు, కొక్కిరాపల్లి పీపీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి కొండబాబు, మున్సిపల్ మేనేజరు ప్రభాకరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ఆట వస్తువులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

క్రీడాకారులకు చక్కటి అవకాశం



నేను హాకీలో జూనియర్ నేషనల్స్ సీనియర్ నేషనల్స్ ఆడాను. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ప్రభుత్వం క్రీడాకారులకు ఆట పరికరాలు అందించి ఆటలు ఆడడానికి ప్రోత్సాహం ఇవ్వడం అభినందనీయం. క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి స్పోర్ట్సు కోటాలో ఉద్యోగాలు ఎక్కువగా కల్పించాలని కోరుతున్నాం.

– సిహెచ్. సాయి,
జాతీయ స్థాయి హాకీ క్రీడాకారుడు, యలమంచిలి

మంచి ప్రోత్సాహం



ఆడుదాం ఆంధ్రా క్రీడలు మాలాంటి క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తుంది. సచివాలయ స్థాయిలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో రాణించడానికి సిద్ధంగా ఉన్నాను. క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవడానికి భవిష్యత్‌లో స్కూల్ గేమ్స్‌లో రాణించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది.

– సింగంపల్లి లక్ష్మీ హర్షిత్,
షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, యలమంచిలి

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



రంగువల్లులు వేస్తున్న బాలికలు

కశింకోట : మండలంలోని గాయత్రి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసు, బుడబుక్కల వాని వేషధారణతో అలరించారు. భోగి మంటలు వేశారు. దాని చుట్టూ నృత్యం చేస్తూ బాలికలు కోలాటం ఆడారు. బాలురు గాలి పటాలను ఎగురవేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి. రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ వై. నగేష్, యాజమాన్య సభ్యులు జీవీఎన్ రమేష్‌కుమార్, బి. నరసింహమూర్తి, రిటైర్డు టీచర్ జి. సూర్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.